పేరుకే పెద్దాసుపత్రి

- బోధన్ ఆస్పత్రిలో వైద్యుల కొరత
- ఇబ్బందులు పడుతున్న రోగులు


బోధన్‌లోని జిల్లా ఆస్పత్రి


ఓపీ విభాగంలో నిల్చున్న రోగులు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి 'పేరుకే పెద్ద ఆస్పత్రి' అని ప్రజలు పెదవి విరుస్తున్నారు. జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యి ఏళ్లు గడుస్తున్నా వైద్యుల కొరత కారణంగా రోగులకు అవస్థలు తప్పడం లేదు. బోధన్ సబ్ డివిజన్ పరిధిలోని పట్టణంతోపాటు బోధన్ రూరల్, సాలుర, కోటగిరి, పొతంగల్, రుద్రూర్, వర్ని, చందూర్, మోస్రా, ఎడపల్లి, రెంజల్ మండలాల ప్రజలు, పక్క రాష్ట్రమైన మహారాష్ట్రలోని బిలోలి తాలుకా పరిధిలోని గ్రామాల ప్రజలు చికిత్స కోసం ఇక్కడికి వస్తుంటారు. ప్రతిరోజూ 500 నుంచి 600 ఓపీ, 60 నుంచి 70 మంది ఇన్‌పేషెంట్స్ ఉంటారు. సీజనల్ వ్యాధుల ప్రబలే సమయంలో 800 నుంచి వెయ్యి వరకు ఓపీతోపాటు 100 నుంచి 150 మంది ఇన్‌పేషెంట్స్ ఉంటారు. 2018 మే నెలలో జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ వైద్యారోగ్య శాఖ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆస్పత్రి అప్‌గ్రేడ్ అయ్యిందే తప్ప జిల్లా ఆస్పత్రికి అవసరమైన వసతులు, వనరులు సమకూరక పోగా, ఇప్పటికీ 100 పడకలు మాత్రమే ఉన్నాయి.

వైద్యులు 15మంది మాత్రమే..

జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన ఆస్పత్రిలో 27 మంది వివిధ విభాగాలకు సంబంధించిన వైద్యులు ఉండాలి. అయితే 15 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. ఇందులో ఆరుగురు రెగ్యులర్ వైద్యులు కాగా, మిగతా తొమ్మిది మంది కాంట్రాక్ట్ పద్ధతిన కొనసాగుతున్నారు. మరో ఐదుగురు రెగ్యులర్ వైద్యులు డిప్యుటేషన్‌పై ఉన్నారు. జిల్లా ఆస్పత్రిలో గైనిక్ వైద్యురాలు పర్మినెంట్ లేక గర్భిణులకు ఇబ్బందులు తప్పడం లేదు.

జిల్లా ఆస్పత్రిలో ఉండాల్సినవి..

జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయిన తరువాత 250 పడకలతోపాటు పూర్తి స్థాయిలో వైద్య నిపుణులు ఉండాలి. ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, రేడియాలజిస్ట్ తోపాటు ముఖ్యమైన విభాగాల్లో వైద్యులు లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతూ ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించే పరిస్థితి ఉంది. ఇప్పటి వరకు స్కానింగ్ యంత్రం ఊసేలేదు.

స్థల సేకరణ ఊసే లేదు...

బోధన్‌లోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేసి ఐదున్నరేళ్లు గడిచిపోతున్నా స్థల సేకరణ ఊసేలేదు. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రి ఉన్న స్థలంలోనే కొనసాగుతోంది. జిల్లా ఆస్పత్రి ఏర్పాటు చేయడానికి ఏరియా ఆస్పత్రి ఉన్న స్థలం తక్కువగా ఉండడంతో అనువుగా ఉండదు. జిల్లా ఆస్పత్రికి 10 ఎకరాల స్థలం అవసరం ఉంటుంది. జిల్లా ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయినా.. ఇప్పటి వరకు స్థల సేకరణ ఊసే లేకుండాపోయింది.

ఉన్నతాధికారులకు విన్నవించాం



జిల్లా ఆస్పత్రికి అవసరమైన 10 ఎకరాల స్థలంతోపాటు అవసరమైన వసతుల కల్పన కోసం ఉన్నతాధికారులకు ఇప్పటికే విన్నవించాం. ఆస్పత్రిలో రోగులకు వైద్య సేవలు అందించేందుకు వైద్యుల నియామకం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరాం.

– రాహుల్, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్

క్లుప్తంగా

మహాసభలను విజయవంతం చేయాలి



కమ్మర్‌పల్లి: ఈనెల 28న వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కార్మిక నాయకులు కోరారు. మండలంలోని ఉప్లూర్‌లో మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్మిక నాయకులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న 60 వేల మంది కార్మికులకు పని భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ నిర్వహించే మహాసభలను కార్మికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. అశోక్, సత్తెక్క, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఫ్రీజర్ వితరణ



నవీపేట : మండలంలోని నాళేశ్వర్ గ్రామానికి చెందిన బజరంగ్‌దళ్ యూత్ ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన ఫ్రీజర్‌ను వీడీసీ ప్రతినిధులకు బుధవారం అప్పగించారు. కార్యక్రమంలో సర్పంచ్ ద్యాగ సరిన్, సొసైటీ చైర్మన్ మగ్గారి హన్మాండ్లు, ఉప సర్పంచ్ లక్ష్మణ్, నర్సింగ్ రావు, గిరినాథ్, సురేశ్, స్వామి, హరీశ్, చిన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



బోధన్‌రూరల్(బోధన్): విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్ అన్నారు. మండలంలోని పెంటాకుర్దు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ ఆఫ్ బోధన్ అపెక్స్ వైటల్ ఆధ్వర్యంలో టై, బెల్టులను బుధవారం పంపిణీ చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్యను అందించడంపై తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన సూచించారు. రూరల్ సీఐ శ్రీనివాస్‌రాజ్, ఎస్సై నాగనాథ్, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీని కలిసిన నాయకులు



మాక్లూర్: మండలానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్‌ను హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిసిన వారిలో గంగాధర్‌గౌడ్, బి.దయాకర్‌రావు, లచ్చారెడ్డి, రాజేశ్వర్, నర్సాగౌడ్, ఆకుల సుభాష్, జనార్దన్ తదితరులున్నారు.

నిత్యావసర వస్తువులు అందజేత



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం ఇస్సాపల్లి, ఆలూర్ మండలం రాంపూర్ గ్రామాల్లోని పని ప్రాంత ఆవాస యోజన పాఠశాల విద్యార్థులకు డీఈవో దుర్గా ప్రసాద్ సొంత ఖర్చులతో నిత్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. విద్యార్థులకు ఉపయోగపడే టీ షర్టులు, సబ్బులు, కొబ్బరి నూనె, పుస్తకాలు, పెన్నులతోపాటు కాస్మొటిక్స్‌ను అందజేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పని చేస్తున్న వారు తమ పిల్లలను పనిలోకి తీసుకెళ్లకుండా చదివించాలన్నారు. జీసీడీవో వనిత, ఎంఈవో రాజ గంగారాం, సీఆర్‌పీ సంతోష్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.

ఉచిత పశువైద్య శిబిరం



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని చింరాజ్‌పల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా పశువైద్యాధికారి జగన్నాథచారి పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ సహాయ సంచాలకులు డాక్టర్ మాజిద్, సర్పంచ్ గణేశ్, ఎంపీటీసీ శ్రీనివాస్, మండల వైద్యాధికారి హన్మంత్‌రెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు గాంధీ, సిబ్బంది సరళారాణి, విజయ, స్వప్న, సత్యం, శ్యామల, విజయలక్ష్మి, రాజేందర్, గోపాలమిత్రలు రాజేశ్వర్, రఫీ, శశి, రైతులు పాల్గొన్నారు.

29న ముఖ్యకార్యకర్తల సమావేశం


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

బోధన్‌టౌన్(బోధన్): నియోజకవర్గంలో రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న నాయకత్వాన్ని బలోపేతం చేయాలని టీఎస్ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుండారం మోహన్ అన్నారు. పట్టణంలో బుధవారం టీఎస్ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ.. ఈ నెల 29వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించనున్న ముఖ్య కార్యకర్తల సమావేశానికి, ముఖ్య కార్యకర్తలతోపాటు నాయకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు ఆకారం యాదయ్య, మల్లెమారి సుధాకర్, పోసాని అక్క, నాగూరావు, మల్ల సాయిలు, అద్దంకి లింగయ్య, ఈరపురం పోశెట్టి, సుందు భూమయ్య పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత కమ్మర్‌పల్లి


కప్‌తో కమ్మర్‌పల్లి జీసీసీ జట్టు..


బోదేపల్లి జట్టు..

కమ్మర్‌పల్లి: బషీరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బషీరాబాద్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నీలో కమ్మర్‌పల్లి జీసీసీ జట్టు విజేతగా, పల్లికొండ జట్టు రన్నర్‌గా నిలిచింది. విజేతలకు సర్పంచ్ అశోక్ బహుమతులను అందజేశారు. ఎనుగందుల రాజేశ్, ఖత్తర్ గంగాధర్, తోపారం గంగాధర్, బండెల రాజు పాల్గొన్నారు.

బీఎంపీఎల్ విజేత బోదేపల్లి..

బాల్కొండ: మండల కేంద్రంలో నిర్వహించిన బాల్కొండ మండల ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నీ విజేతగా బోదేపల్లి జట్టు నిలిచింది. విజేత జట్టుకు కప్, నగదు అందజేశారు. ఉప సర్పంచ్ వాహబ్, నాయకులు మాసం గోపి, అన్వర్, దయాకర్, రవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం


ముప్కాల్ కేజీబీవీలో బహుమతుల ప్రదానం


మామిడిపల్లి మైనార్టీ గురుకులంలో ప్రతిజ్ఞ..


రెంజల్‌లో విజేతలకు బహుమతుల ప్రదానం..


పొతంగల్‌లో..

సాక్షి నెట్‌వర్క్: ప్రతి బాలిక తప్పనిసరిగా చదుకోవాలని, ఉన్నత చదువుల్లో రాణించాలని అధికారులు పేర్కొన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. బాలికలు అనేక సందర్భాల్లో బడికి వెళ్లకుండా మధ్యలో చదువు మానేసి, బాల కార్మికులుగా మారుతున్నారని అన్నారు. బాలికల సంరక్షణ, వారి విద్య కోసం కేంద్ర ప్రభుత్వం బేటీ బచావో – బేటీ పడావో పథకాన్ని అమలు చేస్తోందన్నారు. బాల్యవివాహాలను అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్నదన్నారు.

ఎర్రజొన్న పంట ధ్వంసం



బాల్కొండ: ముప్కాల్ మండలం కొత్తపల్లికి చెందిన రైతు గుమ్మడి చిన్నారెడ్డికి చెందిన ఎర్రజొన్న పంటను అడవి పందులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశాయి. పంటను పూర్తిగా నేలమట్టం చేశాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. అడవి పందులు ఎక్కువ కావడంతో పంటలకు రక్షణ లేకుండ పోయిందని, తోటలోకి వెళ్లాలంటే భయంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశాడు. సుమారు రెండు క్వింటాళ్ల జొన్న నష్టం వాటిల్లిందన్నాడు.

నూతన కమిటీ ఎన్నిక

వర్ని (మోస్రా): మోస్రా గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీ అధ్యక్షుడిగా మొండి శేఖర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా మద్దెల లక్ష్మణ్, ఉపాధ్యక్షులుగా బేగరి లక్ష్మణ్, నూలు రాజు, కోశాధికారిగా సాలూరి అశోక్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు అంబేడ్కర్ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నూలు సాయిలు తెలిపారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని అమ్దాపూర్‌లో సీసీ రోడ్డులను సర్పంచ్ సిర్ప మంజుల బుధవారం ప్రారంభించారు. 15వ ఫైనాన్స్ నిధులతో పనులను చేపడుతున్నట్లు ఆమె తెలిపారు. ఉప సర్పంచ్ రాధాకృష్ణ, నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి

బోధన్‌టౌన్(బోధన్): తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని టీడీపీ జిల్లా కార్యదర్శి హనుమంత్‌రావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. తెలుగు జాతి గొప్పదనాన్ని చాటిన వ్యక్తిగా, నేషనల్ ఫ్రంట్ మాజీ చైర్మన్‌గా బాధ్యతలను నిర్వర్తించిన ఎన్టీఆర్ నటుడిగా తన ముద్రవేశారన్నారు.

రుణమాఫీ చేయాలి


వైద్య సిబ్బందితో ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

భీమ్‌గల్: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని, ఎకరానికి రూ.15వేలు రైతు బంధు ఇవ్వాలని బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మండలంలోని జాగిర్యాల్, పిప్రి, పల్లికొండ గ్రామాల్లో హెల్త్ సబ్ సెంటర్ భవనాలు, దేవన్‌పల్లి, లింగాపూర్, రూప్లె తండాల్లో గ్రామ పంచాయతీ భవనాలు, బడా భీమ్‌గల్‌లో బస్‌షెల్టర్‌ను ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిర్మాణం పూర్తయిన హెల్త్ సబ్ సెంటర్లను ప్రారంభించామని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే హెల్త్ సబ్ సెంటర్లలో వైద్యులను నియమించి, అవసరమైన మందులను అందు బాటులో ఉంచితే గ్రామీణ ప్రాంత ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుతాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే ప్రజల పక్షాన ఆందోళన చేస్తామన్నారు. ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు వెనుకడుగు వేసేది లేదన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి, ఎంపీపీ ఆర్మూర్ మహేశ్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

అవకతవకలకు పాల్పడితే చర్యలు


వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆర్మూర్‌టౌన్: వ్యాపారులు వస్తువులను తూకం వేసే సమయంలో అవకవతవకలకు పాల్పడితే తూనికలు, కొలతల శాఖకు సమాచారం అందించాలని, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా అసిస్టెంట్ కంట్రోలర్ నిర్మల్‌కుమార్ అన్నారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సంతలో తూనికలు, కొలతల శాఖ ఆధ్వర్యంలో వ్యాపారులు, వినియోగదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ మహ్మద్ సుజాత్ అలీ, సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ రవీందర్, జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్ సురేందర్, సిబ్బంది రాజలింగం, రమేశ్‌బాబు, ఆంజనేయులు, సలీం, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న నారాయణ

బాల్కొండ: మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని మత్స్యసహకార సంఘం జిల్లా నాయకుడు నారాయణ డిమాండ్ చేశారు. ముప్కాల్ మండలం వేంపల్లిలో ఉమ్మడి బాల్కొండ మండలంలోని పలు గ్రామాల మత్స్యకారుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో చేపల వేటకు ఎదురవుతున్న సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు.

వరద కాలువ ద్వారా నిరంతరం నీటిని విడుదల చేయడంతో చేపలు వెళ్లిపోతున్నాయన్నారు. వరద కాలువ హెడ్‌రెగ్యులేటర్‌కు వెంటనే జాలి గేట్లను అమర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం దృష్టికి మత్స్యకారుల సమస్యలను తీసుకువెళ్లాలని నిర్ణయించారు. సమావేశంలో ఆయా గ్రామాల మత్స్యకారులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాలనీ కమిటీ ప్రమాణ స్వీకారం


ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మాక్లూర్: మండలంలోని మానిక్‌బండార్ శివారులోని ఆర్టీసీ కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. కాలనీ కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా సురేశ్ రాజేందర్, ప్రధాన కార్యదర్శిగా మీసాల రోహిత్, కోశాధికారి విఠల్ సుమన్ ప్రమాణం చేశారు. గౌరవ అధ్యక్షుడిగా కె సత్యంరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్ గంగాధర్, ఉపాధ్యక్షులుగా ఎస్ రాజేశ్వర్‌రావు, డి లక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా సి పవన్, పి రమేశ్‌రెడ్డి, ఎం అనిల్‌రాజ్, ఎం వేణు, గౌరవ సలహాదారులుగా జి ప్రభాకర్‌రెడ్డి, అమర్ వాజ్ బ్రహ్మయ్య, వి రాములు, ఎం రామ్‌రెడ్డి, ఎం భీమ్‌రావు, కార్యవర్గ సభ్యులుగా పి సామ్యూల్, బి శ్రీనివాస్‌రెడ్డి, టి మణికంఠ, డి రామ్, జి పుష్పలతను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎల్ గోవిందరెడ్డి, కె బాపురావు, ఎన్ అశోక్ పాల్గొన్నారు.

ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలి


ఉత్తమ డ్రైవర్లను సన్మానిస్తున్న రీజినల్ డిప్యూటీ మేనేజర్ శంకర్

ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ డ్రైవర్లు ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చాలని రీజినల్ డిప్యూటీ మేనేజర్ శంకర్ అన్నారు. డ్రైవర్స్ డే సందర్భంగా పట్టణంలోని ఆర్టీసీ డిపోలో బుధవారం ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. ఆర్టీసీకి ప్రయాణికులకే దేవుళ్లని అన్నారు. డ్రైవర్లు బస్సులను జాగ్రతగా నడుపాలని, సంస్థను లాభాల్లోకి తీసుకురావాలని కోరారు. అనంతరం ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. డిపో మేనేజర్ ఆంజనేయులు, సీనియర్ ట్రాఫిక్ మేనేజర్ పారు, ఎంఎఫ్ సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ ధర్సింగ్, డిపో ఉద్యోగులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు



రుద్రూర్/బాల్కొండ: రక్తహీనత ముక్త్‌భారత్‌లో భాగంగా విద్యార్థులకు బుధవారం రక్తపరీక్షలు నిర్వహించారు. పొతంగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాల్కొండ మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల విద్యార్థుల రక్త నమూనాలను సేకరించారు. రక్తహీనత ఉన్నట్లు గుర్తించిన వారికి ఐరన్ మాత్రలు అందజేశారు. బాల్కొండ ఎంఈవో రాజేశ్వర్, వైద్యాధికారి సూర్యనారాయణ, ప్రిన్సిపల్ శంకర్, పొతంగల్‌లో ఆర్‌బీఎస్‌కే వైద్యాధికారి జయప్రకాశ్, హెచ్‌ఈవో గోవర్ధన్, హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమార్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లిష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	గుంటూరు కారం (తెలుగు) – 12.30, 6.50, సైంధవ్(తెలుగు)– 3.50, నా సామిరంగ (తెలుగు) 10.10
స్క్రీన్-2 –	ఫైటర్ (హిందీ) 3డీ – 11.15, 2.50, 6.25, 10.00
స్క్రీన్-3 –	హనుమాన్ (తెలుగు)– 11.30, 2.50, 6.10, 9.30
స్క్రీన్-4 –	హనుమాన్ (తెలుగు) – 12.40, 7.10, 10.30, నా సామిరంగ (తెలుగు)– 4.00

సంక్షిప్తం

రాష్ట్రస్థాయి గణిత పరీక్షకు ఎంపిక



వేల్పూర్: మండలంలోని మోతె ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి రామకృష్ణ రాష్ట్రస్థాయి గణిత ప్రతిభాపాటవ పరీక్షకు ఎంపికైనట్లు హెచ్ఎం వి.గణేశ్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణను పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అభినందించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

డొంకేశ్వర్(ఆర్మూర్): తెలంగాణ నాల్గో తరగతి ఉద్యోగుల జిల్లా సంఘం కార్యవర్గం ఏర్పడింది. జిల్లా అధ్యక్షుడిగా రామ్‌జీనాయక్, కార్యదర్శిగా గొండస్వామి, సహాయఅధ్యక్షులుగా నాగరాజు, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, రవి, జాయింట్ సెక్రటరీగా పాషా, కోశాధికారిగా కళావతి ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులు ఆయా జిల్లా శాఖల అధికారులను కలిసి సన్మానించారు.

నేడు ఓటరు చైతన్య ర్యాలీ



ఆర్మూర్‌టౌన్: జాతీయ ఓటరు దినోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆర్మూర్ తహసీల్దార్ శ్రీకాంత్ అన్నారు. 14వ జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం తహసీల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. సీనియర్ ఓటర్లకు సన్మానం, ఓటరు చైతన్య ర్యాలీ తదితర కార్యక్రమాలను గురువారం నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో విద్యార్థులకు ముగ్గులు, వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేయాలన్నారు. నాయబ్ తహసీల్దార్ విజయ్‌కాంత్, భరత్, అశోక్‌సింగ్, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు..

బాల్కొండ: బాల్కొండ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు నియోజక వర్గ స్థాయి వ్యాసరచన, ఉపన్యాస పోటీలను నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గెలుపొందిన విద్యార్థులు గురువారం ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టరేట్‌లో రిపోర్టు చేయాలన్నారు.

అంబేడ్కర్ చిత్రపటం ఉంచాలి

డొంకేశ్వర్(ఆర్మూర్): ఈనెల 26న నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకల్లో అంబేడ్కర్ చిత్రపటాన్ని ఉంచి జెండా ఆవిష్కరించాలని బీఎస్పీ ఆర్మూర్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. అంబేడ్కర్ వల్లే రాజ్యాంగం అమల్లోకి వచ్చిందని, ఆయన చిత్రపటాన్ని తప్పకుండా ఉంచాలని డిమాండ్ చేశారు.